క్లుప్తంగా

జగనన్న సురక్షలో 1396 సమస్యల పరిష్కారం

ఏర్పేడు: మండలంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఎంపీడీఓ గిడ్డయ్య శనివారం చెప్పారు. మండలంలోని 19 సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమాల్లో వివిధ సమస్యలపై 14,560 ప్రజలు అర్జీలు అందజేశారన్నారు. వీటిలో 1,396 సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని శనివారం బీజేపీ మహిళా నేతలు పరిశీలించారు. తెలంగాణ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పల్లె వీణరెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షురాలు ప్రశాంతిరాజు స్థానిక బీజేపీ నేతలతో కలిసి ఆస్పత్రికి వచ్చారు. బాలింతలకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆడ పిల్లల కోసం ప్రవేశపెట్టి పథకాలనువివరించారు. బీజేపీ నేతలు ఉమా సింగ్, గరికపాటి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండీపుత్తూరులో వీధిలైట్ల ఏర్పాటు



ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో శనివారం సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి పంచాయతీ పరిధిలోని ఎండీపుత్తూరు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో వీధిలైట్లు మరమ్మతులకు గురయ్యాయి. గ్రామస్తులు సమస్యను సర్పంచ్‌కు విన్నవించడంతో వెంటనే స్పందించారు. గ్రామాల్లో మరమ్మతులకు గురైన వీధిలైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. ఆయన కథనం.. తిరుపతికి చెందిన వాసు(39), త్రివిక్రమ్ (35) ద్విచక్ర వాహనంపై వెంకటగిరికి వెళుతున్నారు. ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ముందు వెళుతున్న లారీని అధికమించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తునట్లు సీఐ చెప్పారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి 4వ వార్డుకు చెందిన ప్రేమ్‌కుమార్ కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శనివారం ఆర్థిక సాయం చేశారు. ప్రేమ్‌కుమార్ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యుల ద్వారా వారికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

భార్య సహా ఆరుగురిపై కేసు

భర్తపై దాడి ఘటన

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లెలో సునీల్‌పై దాడిచేసిన ఘటనలో భార్య సహా కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి శనివారం రాత్రి తెలిపారు. జంగాలపల్లెకు చెందిన సునీల్, తిరుమలకు చెందిన రీతూపావనితో 2021 మే నెలలో వివాహమైంది. కుటుంబ సమస్యలపై రీతూపావని ఇటీవల తిరుపతిలోని దిశ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో ఈనెల 27 సునీల్‌పై భార్య రీతూపావని, మధుమోహన్, సంపూర్ణ, భాగ్యమ్మ, రుచిత, హేమంత్ దాడిచేసి గాయపరిచారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

నీలగిరి మొక్కల పంపిణీ



రైతులకు పంపిణీ చేస్తున్న తైలం మొక్కలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని రౌతుసూరమాల చుట్టు పక్కల గ్రామ ప్రజలందరికీ గ్రీన్ ప్యానెల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నీలగిరి మొక్కలు పంపిణీ చేయనున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు శనివారం కార్యాలయ ఆవరణలో ప్రతినిధులు మాట్లాడుతూ టెక్నికల్ పరిజ్ఞానంతో బీడు, బంజరు, ఇసుక, ఎర్రనేలల్లో సునాయాసంగా పెరిగే నీలగిరి మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ నుంచి ఐదు కిలోమీటర్ల పరిధి దాటిన రైతులకు సబ్సిడీ పద్ధతిలో, ఐదు కిలోమీటర్ల పరిధిలోని రైతులకు ఉచితంగా మొక్కలు అందిస్తామన్నారు. వివరాలకు 9100888676, 8700493301లో సంప్రదించాలని కోరారు.



ప్రకృతి ఒడిలో పచ్చని తివాచీ

ప్రకృతి ఒడిలో పచ్చందాలు కనువిందు చేస్తున్నాయి. పొలాలు పచ్చదనం సంతరించుకున్నాయి. వారం నుంచి వర్షాలు కురుస్తుండడంతో పొలం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. తెగుళ్లు ఆశించకుండా క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట మండలం, మల్లవరంలో పచ్చాని పైటేసినట్లు దర్శనమిస్తున్న నేలతల్లి. - సాక్షి, తిరుపతి

సచివాలయాలు.. సత్వర సేవలు

- సుదూర ప్రాంతానికి వెళ్లే అవస్థలకు చెక్
- గ్రామంలోనే ప్రభుత్వ సేవలు
- నియోజకవర్గంలో 79 గ్రామ, 22 వార్డు సచివాలయాలు
- సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో పెరిగిన విశ్వాసం



మామండూరు సచివాలయంలో సేవలు అందిస్తున్న సిబ్బంది

రేణిగుంట: 'చిన్నపాటి కుల ధ్రువీకరణ పత్రం కోసం అర్జీ రాసుకుని సుదూరాన ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి పడిగాపులు కాసే పరిస్థితి.. వీఆర్‌వో ఉంటే తహసీల్దార్ అందుబాటులో ఉండరు.. దరఖాస్తు చేసిన పది రోజులకు గానీ సర్టిఫికేట్ చేతికందేది కాదు.. లేదా... త్వరగా పనైపోవాలంటే కిందిస్థాయి సిబ్బంది చేతులు తడపాల్సిన దుస్థితి. ఇదంతా గతం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో ఊరూరా గ్రామ సచివాలయాలు వెలశాయి. ఏ పనైనా సచివాలయంలో అర్జీ ఇస్తే త్వరితగతిన సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఎలాంటి వ్యయప్రయాసలకు తావులేకుండా, లంచాలు, అక్రమాలకు అవకాశం లేకుండా అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయి. దీంతో గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు సులభంగా అందుతున్నాయి. 'మీసేవ' కేంద్రాల్లో లభ్యమయ్యే సేవలను గ్రామ సచివాలయాల్లోనే అందిస్తుండడంతో ప్రధానంగా మండల కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామీణ ప్రజలు సంతోషపడుతున్నారు. నామమాత్ర రుసుం చెల్లించి మున్సిపల్, రెవెన్యూ, మండల పరిషత్, ఉపాధి హామీ, వ్యవసాయ, విద్యుత్, పోలీసు శాఖలకు సంబంధించిన అనేక పత్రాలు, డాక్యుమెంట్లు పొందుతున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సచివాలయాలు	
శ్రీకాళహస్తి మండలం –	22
రేణిగుంట మండలం –	23
ఏర్పేడు మండలం –	19
తొట్టంబేడు మండలం –	15
మొత్తం –	79
శ్రీకాళహస్తి పట్టణం –	22

నిర్ణీత గడువులోపు పరిష్కారం

పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, ఎఫ్ఎంబీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ, ఆధార్ ఈ-కేవైసీ, ఎలక్ట్రికల్ మీటర్ సర్వీస్ కనెక్షన్, కుల, ఆదాయ, నివేశ స్థల ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ కోసం స్లాట్ బుకింగ్ వంటి అనేక రకమైన సేవలను సచివాలయాల్లో అందుబాటులోకి తెచ్చారు. దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత గడువులోపు ఆయా సమస్యలను పరిష్కారం లభించేలా ఆయా శాఖల అధికారుల సమన్వయంతో సేవలు అందిస్తున్నారు. మండల కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామాలకు చెందిన సామాన్యులు ఇంటి ముంగిటే సేవలు అందుతుండడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం ఇది కదా..! అంటూ చర్చించుకుంటున్నారు.

వ్యయ ప్రయాసలకు స్వస్తి



జగనన్న ప్రభుత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థ గ్రామాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజల ముంగిటకు చేర్చింది. గతంలో మీసేవ కేంద్రాలలో లభించే సేవలన్నీ ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లోనే సత్వరం అందుతున్నాయి. మండల కేంద్రానికి దూరంగా ఉన్న సామాన్య ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటోంది. – శ్రావణి, రేణిగుంట

గొప్పగా సేవలు అందిస్తున్నారు



గతంతో పోలిస్తే ఏ సమస్య అయినా వలంటీర్ ద్వారా వెళ్లి సచివాయంలో దరఖాస్తు చేసుకుంటే ఆయా శాఖల సిబ్బంది తాము అందించిన అర్జీలను అధికారులకు పంపి పరిష్కార మార్గం చూపుతున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేదు. అధికారుల్లోనూ జవాబుదారీతనం పెరిగింది. సచివాలయ సేవలు భేషుగ్గా ఉన్నాయి. – హేమలత, చెంగారెడ్డి పట్టెడ(రేణిగుంట)

సచివాలయ అర్జీలపై ప్రత్యేక దృష్టి



సచివాలయాల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాం. వచ్చిన అర్జీలు ఎలాంటి జాప్యం లేకుండా ఆయా శాఖలకు పంపి వెంటనే పరిష్కరిస్తున్నాం. తరచూ సచివాలయ సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తూ తగు సూచనలిస్తూ సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. – హరిబాబు, ఎంపీడీఓ, రేణిగుంట

చరిత్ర సృష్టించిన జగనన్న సురక్ష

- సత్యవేడు నియోజకవర్గంలో 78,921 సర్టిఫికెట్లు పంపిణీ
- ఎమ్మెల్యే ఆదిమూలం



పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో జగనన్న సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభించిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శనివారంతో శిబిరాలు ముగిసిన సందర్భంగా నాగలాపురం మార్కెట్ యార్డులో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 7 మండలాల్లో మొత్తం 96 సచివాలయాలు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా గత నెల 23న ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి అయ్యిందని పేర్కొన్నారు. మొత్తం 78,921 సర్టిఫికెట్లను పంపిణీ చేసి చరిత్ర సృష్టించినట్లు తెలిపారు. కేవలం 30 రోజుల వ్యవధిలో ఇంత పెద్ద మొత్తంలో ఒక్క నియోజకవర్గంలో ఇన్ని వేల సర్టిఫికెట్లు ఇచ్చిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదన్నారు. అలాగే గ్రామాల్లో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నామని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేసిన అన్నీ శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు వైస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు, వలంటీర్లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ముక్కంటి సేవలో తెలంగాణ ఎమ్మెల్యే



ఆలయంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ నాయక్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం తెలంగాణ రాష్ట్రం దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రనాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు పళ్లికొండేశ్వరాలయంలో ప్రదోష పూజలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని ప్రదోష క్షేత్రమైన శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో త్రయోదశి సందర్భంగా ఆదివారం సాయంత్రం నందీశ్వరునికి మహా అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. అలాగే పిచ్చాటూరు మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలోని శ్రీగౌరీ సమేత సోమనాథేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష పూజలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త జ్యోతిరాజు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం





బీఎన్ కండ్రిగ : ప్రత్యేక అలంకరణలో పీర్లు, పీర్ల చావిడి వద్ద కోలాహలం, అగ్నిగుండం ఉత్సవం



శ్రీకాళహస్తి: దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దర్గాలో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో ముస్లింలుప్రార్థనల్లో పాల్గొన్నారు. పండుగ మత సమరస్యాన్ని చాటింది. ఇందులో భాగంగా పీర్ల నిమజ్జనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి సయ్యద్ అహ్మద్,దర్గా నిర్వాహకులు బాబాఫరీద్, కమిటీ సభ్యులు జమ్రుద్‌బాషా, పి.రహీంఖాన్, ఎంఎస్ అబ్దుల్లా, మహమ్మద్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండుగ నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఉన్న పీర్లచావిడిలో బీబీ ఫాతిమా అమ్మవారిని దర్శించుకుని ఆయన పూజలు చేశారు. అనంతరం బీజేపీ పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు వాసు, మురళి, జిలానీబాషా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, వెస్టువరత్తూరు, కాటూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కంచనపుత్తూరు గ్రామాల్లో మొహర్రం పురస్కరించుకుని పీర్ల పండుగను శనివారం ముస్లింలు, హిందువులు కలసి ఘనంగా జరుపుకున్నారు. దర్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల్లోని చావిళ్లలో పీర్లును నిలిపారు. పీర్లుకు ధూపం వేసి ప్రార్థనలు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి అగ్నిగుండ ఉత్సవం నిర్వహించారు. గ్రామస్తులు బెల్లం, పానకాన్ని తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. పండుగలో హిందువులు పాల్గొన్ని మతసామరస్యాన్ని చాటారు. బెల్లాన్ని చదివించారు. భక్తులకు గంధం పంచారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తం



అవగాహన ర్యాలీలో ప్రగతి సంస్థ ప్రతినిధులు

రేణిగుంట: చిన్నారులు, యువతుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్ఐ సుధాకర్‌రావు అన్నారు. ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బెంగుళూరు క్రై సంస్థ సహకారంతో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు, అపహరణ, లైంగిక దాడులు నుంచి పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఏదైనా అనుమానాలు కలిగితే వెంటనే పోలీస్‌కంట్రోల్ రూం–డయల్–100, చైల్డ్ హెల్ప్‌లైన్– 1098, దిశ హైల్ప్‌లైన్– 1056 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి, సుభాష్, సుమలత, కోటేశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

చెంగాళమ్మ దేవతకు విశేష పూజలు




ఆలయంలో వేస్తున్న గంగమ్మ ముగ్గు, ప్రత్యేక అలంకరణలో చెంగాళమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని శ్రీచెంగాళమ్మ అమ్మవారి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేసిన అమ్మవారి ముగ్గు ఆకట్టుకుంది. ఉదయం అమ్మవారి మూలమూర్తికి అభిషేక పూజల అనంతరం సుందరంగా అలంకరించారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో గంగమ్మ, మైల ముగ్గు తీర్పు, కలిశ ఉత్సవం, శేష పాన్పు, కలిశ గ్రామోత్సవం, పోతురాజు ముగ్గులను వేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం అంబళ్లు, శ్రీచెంగాళమ్మ దేవత ముగ్గు, పొంగళ్లు జరుగుతాయి. సోమవారం ఉదయం అమ్మవారి ఊరేగింపు, ఎదురు పొంగళ్లు కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

ఏసు మార్గం అనుసరణీయం



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ఏసు ప్రభువు సూచించిన ప్రేమ, త్యాగం, సహనం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని పరిశుద్ధ చర్చి వ్యవస్థాపకులు సూచించారు. శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి వద్ద నూతనంగా నిర్మించిన పరిశుద్ధ చర్చిని శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జి పవిత్రారెడ్డి ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చర్చి వ్యవస్థాపకులు మోహనయ్య మాట్లాడుతూ ప్రభువు సూక్తులను వివరించారు. అనంతరం పవిత్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు, వైఎస్సార్ సీపీ నాయకులు డానియల్, చర్చి ఫాదర్ బాబు, రవికుమార్, ఏసుబాబు, గున్నయ్య, రవి, ధనకోటి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో రాక్ ఇంజినీరింగ్ పాత్ర కీలకం



వివిధ సంస్థల ప్రతినిధులతో డాక్టర్ పీసీరఝా

ఏర్పేడు: నిర్మాణంలో రాక్ ఇంజినీరింగ్ పాత్ర కీలకమైందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం) శాస్త్రవేత్త డాక్టర్ పీసీ ఝూ అన్నారు. శనివారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ ఆధ్వర్యంలో నేషనల్ బిల్డింగ్‌లో రాక్ ఇంజినీరింగ్ పాత్ర అనే అంశంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ పీసీ ఝూ మాట్లాడుతూ రాక్ భూభాగం, కొండలకు సంబంధించిన సొరంగాలు, ఆనకట్టలు, పునాదులు, వాలులు ఇతర సివిల్ ఇంజినీరింగ్ రూపకల్పనపై అవగాహన కల్పించారు. భారతదేశంలోని రాక్ ఇంజినీరింగ్ సవాళ్లు, అవకాశాలపై చర్చించారు. శిలా ద్రవ్యరాశి ప్రాథమిక లక్షణ, ఇన్–సిటు టెస్టింగ్, పర్యవేక్షణ, రాక్‌మాస్‌లో భూగర్భ తవ్వకాల సంఖ్యా నమూనాలపై అవగాహన కల్పించారు. అదనంగా ఛీనాబ్ వంతెన రూపకల్పన నిర్మాణ అంశాలు, అమలు సమయంలో సవాళ్లపై చర్చించారు. కార్యక్రమానికి దేశంలోని వివిధ సంస్థల నుంచి 150 మంది, ఆన్‌లైన్ ద్వారా 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీలత, ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ మరళీకృష్ణ, జానకిరామయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సేవలపై సంతృప్తి



వైద్య సిబ్బందితో నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీ సేవలపై జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు డాక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, మురుగేషన్ సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం కమిటీ సభ్యులు పీహెచ్‌సీని పరిశీలించారు. పీహెచ్‌సీలో ఫార్మసి, ఇంజెక్షన్, కాన్పులు, వార్డు, మందుల నిల్వ గదులు, ఆస్పత్రి, పరిసరాలు, ఉప కేంద్రాల నిర్వహణ, రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో సలహాలు ఇచ్చారు. మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య సేవలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు నాగరాజు, శిల్ప, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ విహారీ గోవిందా..



గరుడ వాహనంపై విహరిస్తున్న మువ్వగోపాలుడు

పిచ్చాటూరు: మండల కేంద్రంలో శ్రీధర్మరాజ స్వామి ఆలయ తిరుణాళ్లలో భాగంగా తొమ్మిదవరోజు శనివారం సాయంత్రం శ్రీకృష్ణుడు గరుడ వాహనాన్ని అధిష్టించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కళాకారుల పండరి భజనలు, మంగళవాయిద్యాలు, గోవింద భజనల నడుమ ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. పట్టణ ప్రజలు పిండివంటలు నివేదించి, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం అగ్నిగుండం ప్రవేశం, సోమవారం వసంతోత్సవం, సాయంత్రం ధర్మరాజు పట్టాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని సర్పంచ్ వివరించారు.